శ్రీవారి సేవలో ప్రముఖులు



ఈశానేశ్వరుని ఆలయంలో రాజీవ్ కనకాల, సుమ

తిరుమల : తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో ఎంపీ బీకే పార్థసారథి, సినీ నటుడు రాజీవ్ కనకాల, సుమ కనకాల ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

ఈశానేశ్వరుని సేవలో..

తిరుపతి కల్చరల్: సినీ నటుడు రాజీవ్ కనకాల, యాంకర్ సుమ దంపతులు శనివారం తిరుమల నగర్‌లోని ఈశానేశ్వరస్వామివారిని సేవించుకున్నారు. ఆలయ ధర్మకర్త కేతారి సహదేవ, అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు.


వెబ్ కౌన్సెలింగ్‌పై నిరసన

చంద్రగిరి : ఉపాధ్యాయ బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ పద్ధతిలో చేపట్టడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు శనివారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ ఒక్కో ఎస్‌జీటీ వెబ్ కౌన్సెలింగ్‌లో వెయ్యికి పైగా ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వైఖరికి నిరసగా డీఈఓ కార్యాలయాలను ముట్టడించనున్నట్లు వెల్లడించారు.

'గజ' గోవిందం

శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం గజ వాహనంపై శ్రీగోవిందరాజస్వామి ఊరేగారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు కోలాటాలు, నృత్యాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారు గజవాహనంపై విహరించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఈ క్రమంలో ఉదయం హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. అనంతరం ఆలయంలో వేడుకగా స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. ఈ మేరకు బంగారు తిరుచ్చిపై స్వామి వారు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

– తిరుపతి కల్చరల్



గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు



హనుమంత వాహనంపై శ్రీగోవిందరాజస్వామి



స్వామివారి వాహన సేవలో కళాకారుల ప్రదర్శన

ట్రంప్ విధానాలపై వ్యతిరేకత

తిరుపతి కల్చరల్ : ట్రంప్ విధానాలపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతోందని ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కేవీ చలం తెలిపారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో 'ట్రంప్ విధానాలు భారతదేశంపై ప్రభావం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి పెళ్లలు పడి వ్యక్తి మృతి

తిరుపతి క్రైం: డ్రైనేజ్ పనులు చేస్తుండగా పైనున్న మట్టి పెళ్లలు మీద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం.. కర్నూలు జిల్లాకు చెందిన నాగరాజు(27) భార్య ఉషారాణితో కలిసి సుందరయ్య నగర్‌లో డ్రైనేజ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా మట్టిపెళ్లలు పడ్డాయి. దీంతో ఊపిరాడక నాగరాజు మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రెడ్డెప్పనాయుడు సేవలు మరువలేం

తిరుపతి రూరల్ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సర్పంచ్‌గా 43 ఏళ్లపాటు విప్పర్ల రెడ్డెప్పనాయుడు అందించిన సేవలు మరువలేమని సర్పంచ్ బొల్లినేని సుభాషిణి, శుభగిరినాయుడు దంపతులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. ఆదివారం రెడ్డెప్పనాయుడు నివాసం వద్ద నిర్వహించే కర్మక్రియలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సూర్యప్రభ వాహనం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహన సేవ.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓపెన్ చెస్ టోర్నమెంట్.
- జిల్లాలోని 8 కేంద్రాలలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు.
- అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభలు జయప్రదంగా ముగిసినందుకు ఉదయం 11 గంటలకు బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఆత్మీయ సమావేశం.
- తిరుచానూరు పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా పుష్కరిణిలో రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు తెప్పపై శ్రీసుందరరాజస్వామి విహారం.
- అప్పలాయిగుంటలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం చిన్నశేషవాహనం, రాత్రి హంస వాహన సేవ.

బాలికపై లైంగికదాడి దారుణం

తిరుపతి కల్చరల్ : శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం, ఏడు గుర్రాలపల్లెలో దళిత మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడడం దారుణమని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అరుణ, అలివేలు, రాఘవేంద్ర, నగేష్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ బాలికను బ్లాక్ మెయిల్ చేసి 14 మంది ఆరునెలలపాటు లైంగికదాడి చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను టీడీపీ నేతలు, ఎమ్మెల్యే కాపాడాలని యత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. కీచకులకు అండగా నిలబడిన కూటమి పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బాధిత బాలికను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

తిరునగరం..

సరస్వతీ నిలయం



ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో చదువులమ్మ కొలువుదీరింది. విశిష్ట విశ్వవిద్యాలయాలతో తిరునగరం విరాజిల్లుతోంది. దేశంలోని మహానగరాలను తలదన్నే రీతిలో తిరుగులేని ఎడ్యుకేషనల్ హబ్‌గా కీర్తిపతాకను ఎగురవేస్తోంది. వేలాది మంది విద్యార్థుల భవితను ఉన్నతంగా తీర్చిదిద్దుతోంది. అంతర్జాతీయస్థాయిలో రాణించేందుకు అత్యుత్తమ బాటలు వేస్తోంది. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా విభిన్న విద్యాసంస్థల సమాహారంగా వెలుగులు విరజిమ్ముతోంది. అరుదైన కోర్సులను అందిస్తూ భారతావనికి సరస్వతీపుత్రులను కానుకగా అందజేస్తోంది.

- ఎడ్యుకేషనల్ హబ్‌గా తిరుపతి
- ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల కేంద్రం
- ఐఐటీ, ఐజర్‌తో దేశానికే తలమానికం
- అంతర్జాతీయ ప్రమాణాలతో ఆకర్షిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు

తిరుపతి సిటీ : ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి మరో అడుగు ముందుకేసి ఎడ్యుకేషనల్ హబ్‌గా వెలుగొందుతోంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అటు ప్రభుత్వ విద్యాసంస్థలు, ఇటు కార్పొరేట్, ప్రైవేటు విద్యాలయాలు నగర ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నాయి. ప్రధానంగా ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీ, వెటర్నరీ వర్సిటీతో పాటు టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, జాతీయ సంస్కృత వర్సిటీ, ఇండియన్ కులినరీ ఇన్‌స్టిట్యూట్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో దేశ, విదేశీ విద్యార్థులు చదువుతున్నారు. అలాగే ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, ఐజర్ వంటి సంస్థలు తిరుపతికి తలమానికంగా నిలిచాయి. దీంతో తిరునగరం సరస్వతి నిలయంగా పేరుగాంచింది.

పోటీ ప్రపంచంలో రాణించేలా..

ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన తిరుపతి, నేడు విద్యారంగంలో సైతం తనదైన ముద్ర వేసుకుంది. ఉన్నత స్థాయి ప్రమాణాలతో అత్యాధునిక వసతులతో, ఆధునిక పోటీ ప్రపంచంలో దీటుగా నిలబడే స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. ఎల్‌కేజీ నుంచి పీజీ, పీహెచ్‌డీ స్థాయి వరకు నాణ్యమైన విద్యను అందించే సరస్వతీ నిలయాలు తిరుపతి నగర సొంతం. దీంతో పాటు రెండు ప్రభుత్వ, ఓ ప్రైవేటు మెడికల్ కళాశాలలు నగరంలో ఉన్నత చదువులకు బాటలు వేస్తున్నాయి. పారిశ్రామిక రంగ అవసరాలకు దీటుగా ఉపాధి, ఉద్యోగావకాశాలే లక్ష్యంగా ఏర్పేడు పరిసర ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ ఏర్పాటుకు సైతం పునాది రాయి పడింది.

పోటీ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ

తిరుపతిలో సివిల్స్, నీట్, ఇంజినీరింగ్, ఐఐటీ, బ్యాంకింగ్, రైల్వే, ఏపీపీఎస్సీ, యూపీఎస్సీ, ఎన్‌డీఏ, క్యాట్, ఎస్ఎస్‌సీ, టోఫెల్ వంటి పోటీ పరీక్షలకు అత్యాధునిక మౌలిక వసతులతో కోచింగ్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణను అందిస్తున్నాయి. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో రాష్ట్రంలోనే నంబర్ వన్ సిటీగా తిరుపతి నిలవడం గమనార్హం. విజయవాడ, రాజమండ్రి, వైజాగ్ వంటి నగరాలను అధిగమించే స్థాయిలో తిరుపతిలో విద్యారంగం విస్తరిస్తోంది.